క్లుప్తంగా

రిజర్వేషన్ అమలయ్యేవరకు పోరాటం

రిలే నిరాహార దీక్షలో సాధన సమితి సభ్యులు

షాబాద్: బీసీ రిజర్వేషన్ అమలే చేసేవరకు ఉద్యమం కొనసాగిస్తామని బీసీ రిజర్వేషన్ల సాధన సమితి సభ్యులు అన్నారు. మంగళ వారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో రజక సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేదాకా పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. బీసీలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల విషయంలో తీరని అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. పార్టీలకతీతంగా బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి రిజర్వేషన్ల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సందీప్, జంగయ్య, కుమ్మరి దర్శన్, కుమ్మరి శ్రీనివాస్, నక్క శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, లింగం, మాసయ్య, శ్రీశైలం, యాదయ్య, శ్రీను, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



గుంతల రోడ్డుపై పాదయాత్ర ప్రారంభిస్తున్న వివిధ గ్రామాల నాయకులు, యువకులు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి కుంటుపడిందని పలువురు నాయకులు ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఆయా పార్టీల నాయకులు, యువకులు మేడిపల్లి గ్రామం నుంచి పాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో రోడ్లు దెబ్బతినడంతో ఆర్టీసీ బస్సులు సక్రమంగా రావడం లేదన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో తిష్టవేసిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజ మల్లేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

శంకర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం మండలంలోని కొండకల్‌లో రూ.5.30 కోట్లతో నిర్మించనున్న జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలోని వెలిమల గ్రామం నుంచి రంగారెడ్డి జిల్లాలోని తంగడపల్లి వరకు రేడియల్ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ఈ పనులకు ప్రభుత్వ పాఠశాల భవనం అడ్డుగా మారడంతో పాత భవనాన్ని కూల్చి, కొత్త హంగులు, అత్యాధునిక సామగ్రితో కోట్ల రూపాయలతో నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు వ్యాపారవేత్తలు ముందుకు రావాలని కోరారు.

ఆనందాల కేళి.. దీపావళి

- నేడే వేడుక
- ముస్తాబైన దుకాణాలు
- టపాసులు, పూలు, దీపాల కొనుగోళ్లతో సందడి



మొయినాబాద్‌లో బాణాసంచా షాపు వద్ద కొనుగోళ్ల సందడి

షాబాద్: వెలుగులు తెచ్చే పండుగగా విజయానికి ప్రతీకగా దీపావళిని జరుపుకుంటారు. దీపావళి దివ్య దీపాల వరుస. అజ్ఞానపు పొరలను తొలగించి విజ్ఞానపు వెలుగులను నింపుతుంది. పండుగ వేళ ఇంటింటా ఆధ్యాత్మికత ఉట్టిపడనుంది. మహాలక్ష్మీ పూజలు పండుగ ప్రత్యేకం. లక్ష్మీదేవికి ప్రతీకగా దీపారాధన చేయడంతో సంతోషాలు, జీవితాల్లో వెలుగులు, చేసే ప్రతి పనిలో విజయాలు, కార్యంలో సత్ఫలితాలనిస్తాయని భక్తుల నమ్మకం. ప్రతి ఇంటా వెలుగులు నింపే దీపావళిని సోమవారం సంతోషంగా జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమయ్యారు. దేశంలో హిందువులు, సిక్కులు, జైనులు అతిపెద్ద పండుగగా దీపావళిని జరుపుకుంటారు.

లక్ష్మీదేవి పూజలు ప్రత్యేకం

హిందువుల ముఖ్యమైన పండుగల్లో దీపావళి ఒకటి. అశ్వయుజ అమవాస్య రోజు దీపావళి జరుపుకుంటారు. అంతకుముందు రోజు నరకాసుర వద జరిగిన రోజు వ్యాపారులు దీపావళిని నూతన సంవత్సరంగా భావిస్తారు. లక్ష్మీదేవి పూజలు చేసి నూతన ఖాతా పుస్తకాలు తెరుస్తారు. దీపావళి రోజున శ్రీలక్ష్మీమహాగణపతి పూజలు నిర్వహిస్తారు.

నోములు నోచుకోవడం

దీపావళి నుంచి కార్తీక పౌర్ణమి వరకు లక్ష్మీదేవి అనుగ్రహం కోసం ప్రజలు నోములు చేస్తారు. ఇందులో స్త్రీలు తమ సౌభాగ్యంగా ఉండాలని అమ్మవారిని పూజిస్తారు. ఇప్పటికీ కొన్ని కుటుంబాల్లో ఇది వంశపారపర్యంగా వస్తోంది. ఉదయం నుంచి ఉపవాసాలతో ఉంటారు. అమ్మవారి పూజ అనంతరం నైవేద్యంగా పెట్టిన ప్రసాదాలను స్వీకరిస్తారు. నోము నోచుకున్న రోజు స్త్రీలకు వాయినాలు ఇస్తారు. వారి ఇంటి చుట్టూ పక్కన వారిని పిలిచి ప్రసాదాలను అందిస్తారు.

కొత్త అల్లుళ్ల రాక

నూతన వధూవరులకు ఈ పండుగ కొత్త అనుభూతినిస్తోంది. ఈ పండుగ ముందు వివాహమైన కొత్త అల్లుడిని నూతన వధువు తల్లి వారి ఇంటికి తీసుకొస్తారు. నూతన దంపతులకు బడి బియ్యం పోసి, వస్త్రాలు అందజేస్తారు. తమ అమ్మాయికి బంగారాన్ని కానుకగా ఇస్తారు. అల్లుడికి మంచి ఆతిథ్యంతో సంతోషపెడుతారు.

నూతన వస్తువుల కొనుగోలు

దీపావళి రోజు ఏమి కొనుగోలు చేసినా లక్ష్మీదేవి ఇంటికి వస్తుందని ప్రజల నమ్మకం. అందుకే ఈ రోజు ఏదో ఒకటి నూతన వస్తువులను ఇంటికి తీసుకొస్తారు. ముఖ్యంగా లక్ష్మీదేవిని బంగారంతో పూజిస్తారు. అందుకే బంగారం, బంగారు అభరణాలు ఖరీదు చేయడానికి ఆసక్తి చూపుతారు. ద్విచక్ర వాహనాలు, దుస్తులు, గృహోపకరణాలు మొదలైన తీసుకొస్తారు. చిన్నపిల్లలకు బంగారు ఆభరణాలు ధరింపజేస్తారు.

పిండి వంటకాలు

దీపావళి రోజు పండి వంటకాలు చేస్తారు. ముఖ్యంగా పాయసం, బెల్లంతో చేసే బూరెలు ఈ దీపావళి పండుగకు ముఖ్య వంటకాలు. వీటితో పాటు పోలిహోర, లడ్డూలు మొదలైనవి చేస్తారు. కుటుంబంలోని సభ్యులంతా కలిసి సంతోషంగా లక్ష్మీదేవికి ప్రసాదాలను నైవేద్యంగా పెట్టి వాటిని స్వీకరిస్తారు. ముఖ్యంగా వర్షాకాలం ముగిసి శీతాకాలం ప్రారంభ దశలో ఈ వంటకాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

చేవెళ్లలో..

చేవెళ్ల: చేవెళ్ల పట్టణంలో వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ప్రత్యేకంగా టపాకాయల దుకాణాలు, పూలు, ప్రమిదలు, దొంతుల దుకాణాలు వెలిశాయి. అన్ని ఒకేచోట లభించటంతో ఈ ప్రాంతం అంతా పండుగ సందడి కనిపించింది. పండుగ వ్యాపారం కావటంతో అన్నింటి ధరలు మండిపోయాయి.

మార్కెట్‌యార్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

కొత్తూరు: పట్టణంలో డ్వాక్రా భవనం సమీపంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబా ఆదివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. గత మూడేళ్ల క్రితం ప్రారంభమైన పనులు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. దీంతో కూరగాయలు, చికెన్, మటన్ వ్యాపారులు రోడ్ల పక్కనే విక్రయిస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఆదివారం సంతలోకి వాహనాలు వెళ్లని పరిస్థితి ఉంటుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి మార్కెట్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరారు.

బాలాజీ దారి.. మురుగునీరు పారి

మొయినాబాద్: తెలంగాణ తిరుపతిగా పేరొందిన చిలుకూరు బాలాజీ దేవాలయానికి ప్రతి రోజు వేల మంది భక్తులు వస్తుంటారు. ఎంతో భక్తితో దూర ప్రాంతాల నుంచి దైవ దర్శనం కోసం వచ్చే భక్తులకు మురుగునీరు స్వాగతం పలుకుతోంది. మున్సిపాలిటీలోని హిమాయత్‌నగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో మ్యాన్‌హోల్స్ నుంచి మురుగునీరు బయటకు వచ్చి రోడ్డుపై పారుతోంది. పరిసర ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుండడంతో బాలాజీ ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఆలయానికి 2 కిలోమీటర్ల దూరంలో మురుగు నీరు ఇలా రోడ్డుపై పారుతోంది. గత ఆరునెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



హిమాయత్‌నగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

అయ్యప్ప స్వాముల పాదయాత్ర



శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

షాబాద్: మండల పరిధిలోని కొమరబండలో ఉమాశంకర్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు ఆదివారం శబరిమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గురుస్వామి మట్లాడుతూ.. అయ్యప్ప స్వామి ఆశీర్వాదాలు అందరిపై ఉండాలని పాదయాత్ర చేస్తున్న స్వాములు క్షేమంగా స్వామి సన్నిధికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఎస్‌ఐ శ్రీకాంత్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్‌ఐ శ్రీకాంత్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాలలో మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ విభాగంలో గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచారు. ఆదివారం ముగింపు కార్యక్రమానికి ఎస్‌ఐ శ్రీకాంత్ హాజరై గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందడంతో పాటు మేథోశక్తి పెరుగుతుందన్నారు. ప్రతినిత్యం క్రీడల సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడలతో విద్యార్థుల మధ్య స్నేహపూరిత వాతావరణం పెంపొందుతుందని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. అనంతరం కబడ్డీలో గెలుపొందిన జట్టును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అభినందించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత, నర్మద, ఉమ, నిరోజ, అనిత, శ్రీలక్ష్మి, అబిద్ హుస్సేన్, అశోక్‌కుమార్‌యాదవ్, భవాని, శ్రీశైలం, నెహమియా తదితరులు పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటున్న కేంద్రం

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

కొందుర్గు: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు అడ్డుపడుతున్నది కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వమేనని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి చౌరస్తాలో ఆదివారం పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. బీసీల హక్కులను కాలరాస్తుంది బీజేపీ అని మండిపడ్డారు. మోదీ పేరుకే బీసీ ప్రధాని కాని ఆయన పరిపాలన అంతా ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లోనే సాగుతోందన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని, రిటైర్మెంట్ అయిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు బెనిఫిట్స్ లేవని ఆయన ఆరోపించారు. కార్మికుల కష్టాల పట్ల ఈ నెల 23న మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నామని, ఈ కార్యక్రమానికి అందరూ పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు జంగయ్య, నర్సింహ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

షాద్‌నగర్: మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామానికి చెందిన హర్షిణ్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అయితే వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేయాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డిని కోరారు. వెంటనే స్పందించిన ఆయన సీఎం సహాయం నిధి నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని స్థానిక నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, మధు, ఆంజనేయులు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ అందజేస్తున్న నాయకులు